క్లుప్తంగా

పంచాయతీలను ప్రగతి పథంలో నిలపాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేష్‌బాబు

నాయుడుపేటటౌన్: పంచాయతీలను ప్రగతి పథంలో నిలిపేలా చర్యలు తీసుకోవాలని బాపట్ల శిక్షణ కేంద్రం ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం సర్పంచ్‌లు, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులకు గ్రామాల సుస్థిర అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ధనలక్ష్మి, ఎంపీడీఓ సురేష్‌బాబు అధ్యక్షతన జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఉపాధి ఏపీడీ వరప్రసాద్, ఈఓపీఆర్‌డీ గోపాల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ముందుకు



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రమీలారాణి

పెళ్లకూరు : రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పథకం ద్వారా గ్రామాభివృద్ధే లక్ష్యంగా క్షేత్ర స్థాయిలో సిబ్బంది ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఎంపీడీఓ ప్రమీలారాణి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పథకాన్ని 2026 వరకు కొనసాగిస్తున్నట్లు వివరించారు. నిరుపేదలందరూ సామాజిక, ఆర్థిక న్యాయం సాధించాలన్నారు. ముఖ్యంగా మహిళలు, దళితులు సామాజిక న్యాయం, సమానత్వం, ఆర్థిక న్యాయం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి శంకరయ్య, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, ఏఈ మనోజ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో ఆధార్ కేంద్రం ఏర్పాటు



ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

సైదాపురం: స్థానిక ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆధార్ కేంద్రం ఏర్పాటైంది. ఈనెలాఖరు వరకు కేంద్రం సేవలందిస్తుందని ఎంఈఓ దయాకర్ తెలిపారు. ఆధార్ కార్డుల్లో పుట్టిన తేదీ తప్పులు, ఇతర తప్పులున్నా తగిన ఆధారాలను సమర్పిస్తే ఈ కేంద్రంలో సరిచేస్తారని ఆయన చెప్పారు. మండలంలోని 1వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థుల వరకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రణాళికలతోనే సుస్థిరాభివృద్ధి



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

దక్కిలి: గ్రామ పంచాయతీల్లో సర్పంచులు సమన్వయంతో వ్యవహరించాలని, సచివాలయం సిబ్బందితో కలసి సుపరిపాలన అందివ్వాలని ఎంపీడీఓ టి.గుణశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు రెండో రోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ అల్లాబక్షు, ఆర్‌డబ్ల్యూస్ ఏఈఈ నాగరాజు, పీఆర్ ఏఈఈ చంద్రశేఖర్, ఏపీఎం జమునారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పరిమళ పాల్గొన్నారు.

కొండచిలువ కలకలం



మృతి చెందిన పెంపుడు కుక్క

కోట: మండలంలోని మద్దాలి గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున కొండచిలువ కలకలం సృష్టించింది. గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు తన పెంపుడు కుక్కను ఆరుబయట వరండాల్లో కట్టేసి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో కొండ చిలువ కుక్కపై దాడి చేసింది. కొండచిలువ ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా కుక్క అడ్డుకోవడంతో కుక్కపై దాడి చేసి చంపి మింగేందుకు ప్రయత్నించిందని స్థానికులు తెలిపారు. వెంకటేశ్వర్లు బయటకు వచ్చి చూడగా కుక్కను తలవరకు మింగి ఉన్న కొండచిలువను చూసి కేకలు వేశాడు. చుట్టుపక్కల జనం వచ్చేసరికి కొండచిలువ పక్కనే ఉన్న చెరువులోకి వెళ్లినట్లు తెలిపారు. అయితే గత కొద్దిరోజులుగా కొండచిలువ చెరువు సమీపంలో పలువురికి కనబడినట్లు గ్రామస్తులు తెలిపారు. 15 అడుగుల పొడవు ఉన్నట్లు తెలిపారు. కొండచిలువ హల్‌చల్ చేయడంపై ఫారెస్ట్ అధికారులకు సమాచారమిచ్చారు.

కప్పగుంటకండ్రిగ-పాలచ్చూరు పీఆర్ రోడ్ల దుస్థితి





రహదారుణాలు

ఎన్నో ఏళ్లుగా అవస్థలు

పెళ్లకూరు: రహదారులు ప్రగతికి చిహ్నాలు అనే నానుడికి పూర్తి వ్యతిరేకంగా ఇక్కడ గ్రామీణ రోడ్లు నరకానికి దారులుగా మారిపోవడంతో గత పదిహేనేళ్లుగా ఈప్రాంత ప్రజలు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. కప్పగుంటకండ్రిగ-పాలచ్చూరు గ్రామాల మీదుగా వెళ్లే పంచాయతీరాజ్ రోడ్లు దుస్థితి అధ్వాన్నంగా తయారైంది. మండలంలోని పంచాయతీరాజ్ రోడ్లన్నీ దుర్భరంగా ఉండడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. మొత్తం 24 పంచాయతీలలో 56 కిలోమీటర్లు పంచాయతీరాజ్ రోడ్లున్నాయి. వీటిలో కేవలం 12 కిలోమీటర్లు బీటీ, 7 కిలోమీటర్లు సీసీ రోడ్లు ఏర్పాటు చేసి ఉన్నారు. మిగిలిన 37కిలో మీటర్లు పంచాయతీ రోడ్లన్నీ ప్రమాదకరంగా లోతైన గుంతలు ఏర్పడి కంకర రాళ్లు తేలడంతో ప్రయాణం నరకంగా మారింది. ముఖ్యంగా 71వ నంబర్ జాతీయ రహదారి నుంచి కప్పగుంటకండ్రిగ, గిరిజనకాలనీ మీదుగా కోనేటిరాజుపాళెం-కొణతనేరి ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు 5.5 కిలోమీటర్లు ఉంది. దివంగత ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి 1992లో స్వర్ణముఖి నదిపై 300మీటర్లు కాజ్‌వే నిర్మాణంతో పాటు 5.5 కిలోమీటర్లు బీటీరోడ్డు అభివృద్ధి పనులు చేయించారు. 2004లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో ఇక్కడ పంచాయతీరాజ్ రోడ్డుకు నిధులు కేటాయించి మరోసారి అభివృద్ధి చేయించారు. టీడీపీ పాలనలో ఇక్కడ రోడ్డు అభివృద్ధి కోసం ఒక్క పైసా విదల్చకపోవడం గమనార్హం. అయితే 2023లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పీఆర్ రోడ్ల అభివృద్ధి కోసం నిధులు కేటాయించినప్పటికీ హెడ్ ఆఫ్ అకౌంట్‌లో ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. దీంతో అప్పటి నుంచి ఇక్కడ రోడ్డు అభివృద్ధి పనులకు నోచుకోలేదు. దీంతో బీటీ రోడ్డు పూర్తిగా మట్టిరోడ్డుగా మారిపోయింది. రోడ్డంతా లోతైన గుంతలతో దర్శనమిస్తోంది. వర్షా కాలంలో గుంతల్లో వర్షపునీరు చేరడం వల్ల వాహనదారులు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా యడపూడి, కిష్టప్పకండ్రిగ, యాలకారికండ్రిగ, గంగరాజుకండ్రిగ, జూమానుగుంట గ్రామాలకు వెళ్లే పంచాయతీరాజ్ రోడ్లన్నీ అధ్వాన్నంగా ఉన్నాయి. అయితే గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నందిమాల, పునబాక, భీమవరం, ఆర్లపాడు గ్రామాలకు బీటీ రోడ్లు, రావులపాడు, జీలపాటూరు గ్రామాలకు సిమెంట్ రోడ్లు వేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్లు బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చినుకుపడితే బస్సులు రావు..

మండలంలో గ్రామీణ రోడ్లన్నీ అధ్వాన్నంగా మారడంతో చినుకుపడితో రోడ్లపై లోతైన గుంతల్లో వర్షపునీరు చేరడం వల్ల పలు ప్రాంతాలకు బస్సు సౌకర్యం నిలిచిపోతోంది. ముఖ్యంగా శ్రీకాళహస్తి నుంచి చెంబేడు వెళ్లే ఆర్టీసీ బస్సు, నాయుడుపేట నుంచి నందిమాలకు వెళ్లే ఆర్టీసీ సర్వీసులు నిలిచిపోతున్నాయి. ముఖ్యంగా స్వర్ణముఖి నదిపై కలవకూరు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌డ్యామ్‌పై వర్షాకాలంలో వరదనీరు ప్రవహించడంతో శ్రీకాళహస్తి నుంచి పాలచ్చూరుకు వెళ్లే ఆర్టీసీ సర్వీసును నిలిపేస్తున్నారు. దీంతో వర్షాల సమయంలో గ్రామీణులు, విద్యార్థులు, చిరు ఉద్యోగులు పట్టణాలకు వెళ్లేందుకు అనేక కష్టాలు పడుతున్నారు.

ప్రయాణం నరకంగా ఉంది



71వ నంబర్ జాతీయ రహదారి నుంచి పాలచ్చూరు వరకు 8కిలో మీటర్లు బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసం అయిపోయింది. కనీసం నడిచి వెళ్లలేని దుస్థితి నెలకొంది. రోడ్లలో లోతైన గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారడంతో ప్రయాణం నరకంగా మారింది. ప్రభుత్వం స్పందించి రోడ్లు బాగు చేయాలి.

-మద్దాల సోమశేఖర్‌రెడ్డి, పాలచ్చూరు

పట్టించుకునేవారు లేరు:



వర్షాలకు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వాహనాలు సక్రమంగా నడిచే పరిస్థితి లేదు. ఇక్కడ రోడ్ల దుస్థితిపై ఫిర్యాదు చేసేందుకు కూడా పంచాయతీరాజ్ శాఖ అధికారులు అందుబాటులో లేరు. కనీసం మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాలకు కూడా అందుబాటులో ఉండడం లేదు. బీటీ రోడ్డు పూర్తిగా మట్టి రోడ్డుగా మారిపోయి గుంతలమయమైంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలి.

-పెళ్లూరు అనీల్‌కుమార్‌రెడ్డి, కప్పగుంటకండ్రిగ

నేదురుమల్లి రాక నేడు



నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బుధవారం వెంకటగిరికి రానున్నట్లు నేదురుమల్లి కార్యాలయ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాయి. పట్టణంలోని నేదురుమల్లి నివాసంలో ఉదయం 9గంటల నుంచి కార్యకర్తలకు అందుబాటులో ఉండనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నాయి.

ఫైర్‌స్టేషన్ తనిఖీ



మాట్లాడుతున్న డీఎఫ్ఓ

కోట: స్థానిక ఫైర్‌స్టేషన్‌ను మంగళవారం తిరుపతి డీఎఫ్ఓ జె.రమణయ్య తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కోట ఫైర్‌స్టేషన్‌కు త్వరలో కొత్త వాహనాన్ని సమకూర్చడంతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు నిధులు కేటాయిస్తామన్నారు. కోటలో అగ్నిమాపకశాఖ కార్యాలయం భవనం శిథిలావస్థకు చేరిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకురాగా సీఎస్ఆర్ నిధులతో మరమ్మతులు జరిపించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఆయన వెంట ఎస్ఎఫ్ఓ హరీష్ ఉన్నారు.

20న గోదాదేవికి క్షేత్రోత్సవం

రాపూరు: పెంచలకోనలో శుక్రవారం గోదాదేవికి క్షేత్రోత్సవం నిర్వహించనున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. ధనుర్మాసం పురస్కరించుకుని పెంచలకోనలో గోదాదేవికి నాలుగు శుక్రవారాలు ప్రత్యేక పూజలు, క్షేత్రోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా మొదటి శుక్రవారం గోదాదేవికి క్షేత్రోత్సవం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారమే ధ్యేయం

సైదాపురం: రెవెన్యూ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యమని డిప్యూటీ తహసీల్దార్ అనురాధ అన్నారు. చాగణ గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు ద్వారా గ్రామసభను నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు, ప్రజల వద్ద నుంచి అధికసంఖ్యలో సమస్యలపై అర్జీలు స్వీకరించినట్లు డీటీ తెలిపారు. సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వో సూర్య పాల్గొన్నారు.

హామీలు నీటి మూటలు



నాయకులతో మాట్లాడుతున్న నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి

వాకాడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల హామీలు నీటి మూటలుగానే మిగిలిపోయాయని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అన్నారు. వాకాడులోని నేదురుమల్లి నివాసంలో మంగళవారం రాంకుమార్‌రెడ్డి వాకాడు, కోట, చిట్టమూరు మండలాల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వలన రాష్ట్రంలో అధిక ధరలు, విద్యుత్ సర్‌చార్జీలతో పేదలు పెనుభారం మోయాల్సి వస్తోందన్నారు. పేదలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేలా వైఎస్సార్‌సీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి నియోజకవర్గంలో సమావేశాలు నిర్వహిస్తారని తెలిపారు.

స్థానిక సమస్యలు, రాజకీయ పరిణామాలు, జమిలి ఎన్నికలపై నాయకులు చర్చించారు. హిమకుమార్‌రెడ్డి, పెంచల్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, నాగూర్‌రెడ్డి, శేషారెడ్డి, కస్తూరిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన



విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తున్న ఈఈ, డీఈ

నాయుడుపేటటౌన్: విద్యుత్‌ను పొదుపు చేయడమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని నాయుడుపేట డివిజన్ ఈఈ శ్రీనివాసులు సూచించారు. ఇందన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యుత్ పొదుపు అంశంపై వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను ఈఈతో పాటు డీఈ వరప్రసాద్ రెడ్డి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏఈలు శివశంకర్, హరికృష్ణ, సురేష్, డిగ్రీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి



మాట్లాడుతున్న డీఈఈ

వెంకటగిరిరూరల్: విద్యుత్‌ను ప్రతిఒక్కరూ పొదుపుగా వినియోగించాలని డీఈఈ రవిమునిచంద్ర పేర్కొన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని పాలకేంద్రం సమీపం వద్ద ఉన్న విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయంలో మంగళవారం విద్యుత్ పొదుపుపై సమావేశం నిర్వహించారు. ఏఈలు జయచంద్రారెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, జూనియర్ ఇంజినీర్లు, వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

సమయ పాలన ఏదీ?

- 3.30కే వైద్యులు..సిబ్బంది ఇంటికి
- ఫొటోలు, వీడియోలు తీసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు



సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

సైదాపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులతో పాటు సిబ్బంది 3.30కే ఇంటికి వెళుతుండడంతో రోగులు నానా అవస్థలు పడుతున్నారు. అనారోగ్యానికి గురైన ఓ వ్యక్తి ఆస్పత్రికి మంగళవారం సాయంత్రం 3.30కి వెళితే ఆస్పత్రిలో ఉండాల్సిన ఇద్దరు వైద్యులతో పాటు సిబ్బంది కూడా ఇంటి ముఖం పట్టి ఉన్నారు. ఈ విషయమై బాధితుడు స్వయంగా వీడియోలతో పాటు ఫొటోలు తీసి ఉన్నతాధికారులకు వాట్సాప్ మేసెజ్ చేశారు. అనంతరం గూడూరుకు వెళ్లి వైద్యపరీక్షలను చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైద్య సిబ్బంది సమయపాలన పాటించడం లేదనే విమర్శలు గుప్పుమంటున్నాయి. అధునాతమైన భవనంతోపాటు కోట్లాది విలువ చేసే పరికరాలు ఉన్నా రోగిని చూసే నాథుడే కరువయ్యారు. వైద్యులతో పాటు సిబ్బంది కూడా తరచూ సమయపాలన పాటించకపోతుండడంతో రోగులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈవిషయమై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈవిషయమై వైద్యాధికారిణి ప్రశాంతిని వివరణ కోరగా 104 సేవల నిమిత్తం హాజరయ్యానని, సిబ్బందిలో ఇద్దరు నెల్లూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి పనుల నిమిత్తం వెళ్లారని చెప్పారు. మిగిలిన సిబ్బంది విషయమై విచారణ చేస్తామన్నారు.

కండలేరులో 56.612 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం 56.612 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరదకాలువ ద్వారా 500 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. సోమశిల జలాశయం నుంచి 1,100 క్యూసెక్కుల నీరు వస్తుందని తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 800, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 150, మొదటి బ్రాంచ్ కాలువకు 65 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.


నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు



పోలీసులతో మాట్లాడుతున్న డీఎస్పీ

చిట్టమూరు(చిల్లకూరు): నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందికి గూడూరు డీఎస్పీ రమణకుమార్ సూచించారు. చిట్టమూరు పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బందితో డ్రిల్ చేయించారు. అనంతరం స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఐ బలరామయ్య ఉన్నారు.


డీఎంపై చర్యలు తీసుకోవాలి



రిలే దీక్షలు చేస్తున్న నేతలు

గూడూరు రూరల్: గూడూరు ఆర్టీసీ డిపో మేనేజర్ ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయనపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపోలో చేస్తున్న నిరాహారదీక్ష మంగళవారం 6వ రోజుకు చేరుకుంది. నేతలు కేఎం వాసులు, శేషయ్య, రాము, గురవయ్య, జోగి శివకుమార్, వీవీ రమణయ్య, సురేష్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై శిక్షణ



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కలువాయి: రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ కింద గ్రామాల అభివృద్ధిపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం కలువాయి మండల పరిషత్ కార్యాలయంలో ప్రారంభించారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎమ్‌లు, డిజిటల్ అసిస్టెంట్‌లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, మండల స్థాయి అధికారులకు పంచాయతీల అభివృద్ధికి చేపట్ట వలసిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈఓపీఆర్డీ రమేష్, వెలుగు ఏపీఎం రవికుమార్, సీనియర్ అసిస్టెంట్ ఎం.రమేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మ, కొండమ్మ పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం



రిటైర్డ్ ఉద్యోగులైన దంపతులను సత్కరిస్తున్న డీటీఓ శ్రీనివాసులు, సంఘం నేతలు



రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని ఆకుతోట వీధిలో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో మంగళవారం అఖిల భారత పెన్షనర్‌ల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘ గౌరవ అధ్యక్షుడు పేర్నాటి వెంకటేశ్వర్లు డీఎస్ నకర చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ రిటైర్డ్ ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. నాయుడుపేట డివిజన్ ఖజానా శాఖ అధికారి శ్రీనివాసులు, సంఘం అధ్యక్షుడు పీడీ ఉదయశంకర్, నేతలు నాగూరయ్య, కాలేషా, కృష్ణారావు, సుబ్రహ్మణ్యం యాదవ్ పాల్గొన్నారు.

పెన్షనర్లకు అండగా ఉంటా!

చిల్లకూరు: రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవన్‌లో మంగళవారం పెన్షనర్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం పలువురు రిటైర్డ్ ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు మహబూబ్‌బాషా, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ అరుణ్‌కుమార్, చీఫ్ మేనేజర్ సురేష్‌కుమార్, రియాజ్ అహ్మద్, శివకుమార్, క్రిష్ణయ్య, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న దళితులు

సూళ్లూరుపేట రూరల్ : మండలంలోని కోటపోలూరు పంచాయతీలో సర్పంచ్ కమతం అరుణకుమారి ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ల్యాండ్ సర్వేయర్ శ్రీరాములు, మండల ఆర్ఐ రాజగోపాల్ అర్జీలను స్వీకరించారు.

ఓజిలి : తిరుమలపూడి, కుందాం, ఏనుగువాడ గ్రామాల్లో తహసీల్దార్ పద్మావతి మంగళవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. తిరుపాలయ్య, సర్వేయర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు : శిరసనంబేడులో మంగళవారం జరిగిన రెవెన్యూ గ్రామసభకు భూసమస్యలపై పది అర్జీలు వచ్చాయి. తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, ఆర్ఐ సంతోషిణిభాయి, వీఆర్వోలు పాల్గొన్నారు.

శ్రీధనమల్లిలో..

దొరవారిసత్రం : శ్రీధనమల్లి, మానేరి గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. సదస్సుల్లో తహసీల్దార్ శైలకుమారి, మండల సర్వేయర్ నాగరాజు పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేటటౌన్ : మండల పరిధిలోని తిమ్మాజికండ్రిగలోని ప్రాథమిక పాఠశాల వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయి తేజ, సర్పంచ్ నల్లురు ప్రకాశం, వీఆర్వోలు పాల్గొన్నారు.

దక్కిలిలో..

దక్కిలి: రెవెన్యూ సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. దండవోలు, నడింపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుల్లో 33 అర్జీలు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

రాపూరులో..

రాపూరు: రెవెన్యూ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ లక్ష్మీనారాయణ అన్నారు. గుండవోలు గ్రామంలో మంగళవారం రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి 12 అర్జీలు వచ్చాయన్నారు.

కడివేడులో..

చిల్లకూరు: కడివేడు రెవిన్యూ పరిధిలోని భూసమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీనివాసులుకు ఆ గ్రామ దళితులు విన్నవించారు. మంగళవారం కడివేడు సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని దళితులకు సర్వే నంబర్ 805లో 70 ఎకరాల భూమిని పంపిణీ చేశారని, అయితే హద్దులు చూపకపోవడంతో ఆ భూమిని ఆక్రమించుకుంటున్నారని, వెంటనే సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. నేతలు జానకిరెడ్డి ,భాస్కర్‌రెడ్డి, మధురెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రాజేశ్వరనాయుడు,ఆర్ఐ పూర్ణచంద్ర, వీఆర్ఓ బాలాజీ పాల్గొన్నారు.

అధికారులకు అవగాహన

ఓజిలి : మండల వెలుగు కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి పంచాయతీలపై పరిశీలకుడు ప్రసాద్ రెండో రోజు మండల అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల్లో చేపట్టాల్సిన పనులపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఈఓపీఆర్డీ రేణుక పాల్గొన్నారు.